మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# సర్వతోముఖాభివృద్ధికి అడుగులు

- రూ.11కోట్లతో రూ.500కే గ్యాస్ సబ్సిడీ
- 11035ఇండ్లు మంజూరు చేశాం
- రైతుభీమా కింద రూ.44కోట్ల జమ
- 1,61,746 మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేశాం
- అందరిక సహకారంతో ముందుకు..
- మహబూబ్‌నగర్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్న ఎంపి డికె.అరుణ ఎమ్మెల్యే యెన్నం , కలెక్టర్ ,ఎస్‌పి



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి జూపల్లి,ఎంపి డికె.అరుణ,ఎమ్మెల్యే యెన్నం,కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, 15,ప్రభాతవార్త :** మహోన్నత చారిత్రక మహబూబ్ నగర్ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అనేక పథకాలు, కార్యక్రమాలు రూపొందించి అమలు చేయడం జరుగుతున్నది. ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు పెంచే, అభివృద్ధి ఫలాలు అందరికీ పంచే కార్యక్రమం మహాయజ్ఞంగా కొనసాగుతున్నదని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహబూబ్‌నగర్ పరేడ్ గ్రౌండ్ లో జరిగిన స్వాతంత్ర వేడుకలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జెండావిష్కరణ అనంతరం ఆయన ప్రసంగించారు. మహాలక్ష్మి పథకం కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టి 2023 డిసెంబర్ 9నుంచి ఆరు గ్యారంటీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది. జిల్లాలో ఇప్పటికి దాదాపు 2.28 కోట్ల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. రూ. 500 కే గ్యాస్ సిలిండర్ తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా గ్యాస్ సిలిండర్ రూ.500కే పథకం ఇప్పటి వరకు 1,02,658 వినియోగదారులకు 3.85 లక్షల గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసి ప్రభుత్వం రూ.11కోట్ల సబ్సిడీ అందించింది. ప్రతీ పేద కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకూ 1,32,144 కుటుంబాలకు జీరో బిల్లులు జారీచేసినట్లు తెలిపారు. ఈ పథకం కింద ఇప్పటివరకూ ప్రభుత్వం 54 కోట్ల రూపాయల సబ్సిడీ అందజేసింది. ఈ పథకం కింద ప్రతి నియోజకవర్గంలో 3,500 గృహాలు నిర్మించడం జరుగుతుంది. జిల్లాలో ఇప్పటివరకు 11,035 ఇండ్లు 552 కోట్ల రూపాయల అంచనా విలువతో మంజూరుచేశామని, ఇప్పటివరకు 6,568 ఇండ్ల పనులు మొదలయ్యాయి. వాటిలో 2,052 ఇండ్ల బేస్మెంట్ లు, 29గోడలు నిర్మాణం, 123 శిదిద స్లాబులు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి 1,502 ఇండ్లకు సుమారు రూ.17 కోట్లు నిధులు విడుదల కాబడ్డాయి. రైతుభరోసా పథకంలో భాగంగా యాసంగి 2024-25 సీజనుకు గాను జిల్లాలోని మొత్తం 1,88,836 మంది రైతులకు రూ.161 కోట్లు, వానాకాలం 2025 సీజనుకు గాను 2,14,929 మంది రైతులకు 243 కోట్ల రూపాయలు రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరిగింది.రైతు భీమా పథకం క్రింద ప్రమాదవశాత్తు ఏదైన కారణం చేత చనిపోయిన 876 మంది రైతుల నామినీ ఖాతాలలో రూ.44 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 2024 పంటల ఋణమాఫీకి సంబంధించి అర్హులు అయిన 76,385 మంది రైతులకు 597 కోట్ల రూపాయలు పంటల ఋణమాఫీ చేయడం జరిగినది.ఈ సారి వానకాలలో 3,54,004 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గాను ఇప్పటివరకు 2,05,913 ఎకరాలు వివిధ పంటల క్రింద సాగు అయినది. పౌరసరఫరాల శాఖ జిల్లాలో ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున 2,52,191 కార్డులకు 5,612 టన్నులు బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 21,318 కొత్త రేషన్ కార్డులు మంజూరు చెయ్యడంతో పాటు 53,925 కార్డులలో 91,040 కుటుంబ సభ్యులను చేర్చడం జరిగిందన్నారు. జిల్లాలో 189 వరి కొనుగోలు కేంద్రాల ద్వారా 32,099 మంది రైతుల నుంచి 1,61,746 మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేసి, రూ.375 కోట్ల 25 లక్షలు రైతుల ఖాతాలలో జమ చేశామని పేర్కొన్నారు. సన్న రకం వడ్లకు అదనంగా రూ.500 బోనస్ కూడా చెల్లించడం జరుగుతుంది. కళ్యాణ లక్ష్మి కింద 2,962 మందికి 30 కోట్ల రూపాయలు, షాదీముబారక్ కింద 665 మందికి 7 కోట్ల రూపాయలు సాయం అందించామన్నారు. ప్రజా పాలన సేవా కేంద్రాలు జిల్లాలో 21 ప్రజా పాలన సేవా కేంద్రాలు పని చేస్తున్నాయి. భూ భారతిధరణి స్థానంలో నాణ్యమైన సేవలు అందించడానికి కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం జనవరి 4వ తేదీ 2025 నుంచి అమలు పరచడం జరిగింది. మహబూబ్ నగర్ పురపాలక శాఖ టీయూఎఫ్ఐడీసీ పథకము క్రింద రూ.37.87 కోట్లు మంజూరు అయి పనులు ప్రగతిలో వున్నాయి. 6కోట్లు నిధులతో నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు కోసం 3 పనులు ప్రతిపాదించామన్నారు. నగరంలో 5 ప్రాంతాలలో రూ.36 లక్షల నిధులతో పార్కుల అభివృద్ధి పనులు చేయడం జరుగుతున్నది. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, శాంతి భద్రతల నిర్వహణకు అహర్నిశలు కృషిచేస్తున్న పోలీసు యంత్రాంగానికి, వైద్యులకు, పారిశుద్ధ్య కార్మికులకు ధన్యవాదాలు తెలుపుతూ జిల్లాను అభివృద్ధి పథంలో నిలపడానికి అందరి సహకారం కావాలని కోరారు.

## గృహ నిర్మాణ శకటానికి మొదటి బహుమతి



79 స్వాతంత్ర్య దినోత్సవేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వివిధ శాఖలు తమ ప్రగతిని ప్రతిబింబిస్తూ శకటాలు ప్రదర్శించారు. ఈ శకటాల ప్రదర్శనలో గృహ నిర్మాణ శాఖ ప్రదర్శించిన ఇందిరమ్మ ఇండ్లు లైవ్ డెమో మొదటి బహుమతి గెలుచుకుంది. వైద్య ఆరోగ్య శాఖ, మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ శకటాలకు సంయుక్తంగా రెండవ బహుమతి ప్రకటించారు.అటవీ శాఖ శకటానికి మూడవ బహుమతి ప్రకటించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా గృహ నిర్మాణ శాఖ పి.డి.వైద్యం భాస్కర్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె.కృష్ణ,నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి,అటవీ శాఖ అధికారి సత్యనారాయణ లు బహుమతి అందుకున్నారు మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ చెక్కులు పంపిణీపోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద 10 కోట్ల 50 లక్షల రూ ల చెక్కును,స్త్రీనిధి ద్వారా 11 కోట్ల 75 లక్షల చెక్కును మహిళా సంఘాలకు అంద చేశారు.ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసుకుంటున్న లబ్ధిదారులకు 20 కోట్ల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎం.పి. శ్రీమతి డి కె .అరుణ మహబూబ్ నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,ఎస్.పి.డి.జానకి,ఇలా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## త్యాగధనుల ప్రాణత్యాగం వల్లే స్వాతంత్ర్యం

### పేటలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి వాకిటి శ్రీహరి



జెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి శ్రీహరి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తాపట్నాయక్

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** నారాయణపేట పోలీస్ పరడే మైదానంలో ఘనంగా 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని శుక్రవారం రోజు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య యువజన క్రీడా సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. తదనంతరం 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతోమంది త్యాగధనుల ప్రాణత్యాగాల వల్ల సిద్ధించిన స్వాతంత్రం నేడు మనం స్వేచ్ఛ వాయువును పీల్చుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేసిన ఆరు గ్యారంటీల వల్ల ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ ధర్మంలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పరిణికా రెడ్డి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్,ఎస్. పి. యోగేష్ గౌతమ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. శ్రీను, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, మార్కెటింగ్ చైర్మన్ శివారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ విజయ్ కుమార్, అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, ఆర్డీవో రామ్ చందర్, జిల్లా అధికారులు, పరేడ్ కమాండర్ ఆర్ఐ నరసింహ పాల్గొన్నారు.

## నిద్రలోనే అనంతలోకాలకు..

- ఎన్‌హెచ్-44పై ఘోర రోడ్డు ప్రమాదం..
- నలుగురు ప్రయాణికులు మృతి
- లారీని వెనకాల నుంచి ఢీ కొట్టిన వోల్వో బస్సు
- జడ్చర్ల మండలం మాచారం వద్ద ఘటన




మాచారం వద్ద లారీని ఢీ కొట్టిన వోల్వో బస్సు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జడ్చర్ల, ఆగస్టు 15, ప్రభాతవార్త :** వారంతా మరోగంట సమయంలో గమ్యస్థానానికి చేరుకునేవారు. ఇంతలోనే వారిని మృత్యువు కబళించింది. కడప నుంచి హైదరాబాద్ బయలుదేరిన సీజీఆర్ ట్రావెల్స్ బస్సు మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం వద్ద అతివేగంతో వెనకాల నుంచి లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు.. వివరాల్లోకి వెళ్తే.. గురువారం రాత్రి 35 మంది ప్రయాణికులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప నుంచి హైదరాబాద్ బయలుదేరిన బస్సు శుక్రవారం తెల్లవారుజామున మాచారం బ్రిడ్జి వద్ద తెల్లవారుజామున -మిగతా4లో..

## స్వాతంత్ర్య పోరాటం ప్రపంచానికే ఆదర్శం

### శాసనమండలి చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి



అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి




జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** గాంధీజీ సారథ్యంలో సాగిన భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని, అహింసే అస్త్రంగా మహా సంగ్రామాన్ని గెలిచి ప్రపంచానికి సరికొత్త పోరాట పంథాను పరిచయం చేసిందని చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వనపర్తి జిల్లాలోని ఐడిఓసి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించి వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన లక్ష్యాల పై ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ, ఇట్టి వేడుకలకు హాజరైన స్వాతంత్ర్య సమరయోధులకు, పార్లమెంట్ సభ్యులకు, శాసన మండలి సభ్యులకు, శాసన సభ్యులకు, కలెక్టర్, అదనపు కలెక్టర్లకు, జిల్లా న్యాయమూర్తులకు, జిల్లా ఎస్పీ, ఇతర ప్రజాప్రతినిధులకు, వివిద శాఖల జిల్లా అధికారులకు, విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047"తో 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. మహాత్ముడి సారథ్యంలో బయట శత్రువులైన బ్రిటీషర్లపై యుద్ధం గెలిచిన మనం.. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ సారథ్యంలో దేశ అంతర్గత శత్రువులైన పేదరికం, అసమానతలు, అస్పృశ్యత, అంటరానితనంపై పోరాటానికి నాంది పలికామన్నారు. 1947 ఆగష్టు 15వ తేదీన స్వాతంత్ర్యం సాధించిన అనంతరం దేశ ఉజ్వల భవిష్యత్తు, పునర్నిర్మాణానికై పంచవర్ష ప్రణాళికలు రూపొందించి దేశ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి అనేక వినూత్న పథకాలు ప్రవేశపెట్టడం ద్వారా భారతదేశం ఈనాడు ప్రపంచంలో బలమైన దేశంగా అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన చేరిందని అనటంలో అతిశయోక్తి లేదని వివరించారు. అనంతరం పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్సును ముఖ్య అతిథి మహేందర్ రెడ్డి, కలెక్టర్, ఎమ్మెల్యే లతో కలిసి తిలకించి, ప్రభుత్వ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు సిబ్బందికి ముఖ్య అతిథి ప్రశంసా పత్రాలు అందజేసారు. వేదికపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్ రావుల, వనపర్తి శాసనసభ్యులు తుడి మేఘారెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య ఉన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వీరా రెడ్డి, డీఎస్పీలు, జిల్లా అధికారులు, వనపర్తి మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ కమిటి చైర్మన్ ప్రమోదిని పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేయడమే లక్ష్యం

- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి
- ఆకట్టుకున్న విద్యార్థుల ఆపరేషన్ సింధూర్ ప్రదర్శన



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ,కలెక్టర్,ఎస్‌పి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,ఆగస్టు15 ప్రభాతవార్త:** తెలంగాణను దేశంలో అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం పట్టుదలతో పనిచేస్తోందని, రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి దేశానికే మార్గనిర్దేశకంగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ, అదనపు కలెక్టర్ రెవెన్యూ పి.అమరేందర్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు దేవ సహాయంలతో కలిసి జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించి వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన లక్ష్యాలపై ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడూర్ విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలో శత్రుదేశంపై భారత ఆర్మీ జవానులు ఆపరేషన్ సింధూర్ నిర్వహణను కళా రూపంలో ఆవిష్కరించిన విద్యార్థుల కళాత్మక ప్రదర్శనకు మొదటి బహుమతి లభించింది. కేజీబీవీ వెల్దండ విద్యార్థినిలు రుద్రనేత్ర అరుణ అరుణారుణ కథనంతో తెల్లవారి గుండెలదిరే గేతానికి విద్యార్థుల నృత్యాలు దేశభక్తిని చాటేలా, ఆనాటి స్వాతంత్ర సమరయోధుల సాహసోపేతమైన చర్యలను తమ వేష భాష నృత్యాలతో దేశభక్తిని ప్రదర్శించి ఆహుతులను కట్టిపడేసిన ప్రదర్శనకు 2వ బహుమతి ప్రధానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులందరినీ ముఖ్య అతిథి జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ మెమొంటోళ్లను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు విజయవంతంగా, దేశభక్తిని చాటిన విద్యార్థుల కళాత్మక ప్రదర్శనలను నిర్వహించేలా చర్యలు తీసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ సుప్రత్యేక అధికారి జిల్లా కలెక్టర్ ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులతో మమేకమై ఫోటోలు దిగారు. అదేవిధంగా, వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్సును ముఖ్య అతిథి చిన్నారెడ్డి, ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే లతో కలిసి తిలకించారు.

## ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలన

### ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### గద్వాలలో పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి , ప్రభుత్వ సలహాదారు ఎ.పి.జితేందర్ రెడ్డి



జెండాకు సెల్యూట్ చేస్తున్న జితేందర్ రెడ్డి, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

**గద్వాలటౌన్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు, క్రీడా వ్యవహారాలు ఎ.పి. జితేందర్ రెడ్డి పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించి,జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వ పాలన కొనసాగుతుందని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకా ల అమలు వివరాలను తన సందేశం ద్వారా తెలియజేస్తూ,భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచానికి ఆదర్శమని,స్వాతంత్రం తరువాత పేదరికం,అసమానతలు, అస్పృశ్యతపై పోరాటం ప్రారంభించి ప్రజాస్వామ్య పునాదులు వేసినట్లు తెలిపారు. 70 ఏళ్లుగా ప్రజల ఆహార భద్రత కోసం పి.డి.ఎస్ వ్యవస్థ భరోసా ఇస్తోందని,ఉగాది నుండి సన్న బియ్యం" పంపిణీ ప్రారంభించబడిందని తెలిపారు. జూన్, జూలై, ఆగస్టులో 1,64,357 రేషన్ కార్డుదారులకు 11,163 మెట్రిక్ టన్నుల ఉచిత రేషన్ సన్న బియ్యాన్ని పంపిణీ చేసినట్లు తెలిపారు. జూలై 14 నుండి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించి, పదేళ్ల తర్వాత రేషన్ షాపుల వద్ద సందడి మొదలైందని తెలిపారు.రైతు సంక్షేమంలో 58,113 మంది రైతులకు 513 కోట్ల 99 లక్షల రూపాయల పంట రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు .ఇందిరమ్మ రైతు భరోసా" పథకం కింద ఎకరాకు 12,000 రూపాయల పెట్టుబడి సాయం అందించారని,జూన్ 16న ప్రారంభించి 9 రోజులలో 9,000 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 202526 వ వానాకాలంలో 1,69,299 మంది రైతులకు 268 కోట్ల 84 లక్షల రూపాయలు నేరుగా ఖాతాల్లో జమ చేసినట్లు, కొత్త దరఖాస్తు చేసిన 3,289 రైతులకి కూడా పెట్టుబడి సాయం అందించారని పేర్కొన్నారు. జిల్లాలో 75 కొనుగోలు కేంద్రాల్లో 95,378 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసి,క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తూ 221.27 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. జిల్లాలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పంపిణీ లో భాగంగా 59,505 పంపు సెట్లకు విద్యుత్ అందించడం,దీనికి 42.80 కోట్లు సబ్సిడీ చెల్లిస్తున్నామన్నారు స్థానిక సంస్థలలో,విద్యా , ఉద్యోగాల్లో బీసీలకు 42 రిజర్వేషన్లు కల్పించే బిల్లు ఈ ఏడాది మార్చి 17న రాష్ట్ర శాసనసభ ఆమోదించిందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి, రాష్ట్రంలోని 59 ఎస్సీ ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించి, గ్రూప్1లో 15, గ్రూప్2లో 18, గ్రూప్3లో 26 కులాలను చేర్చినట్లు తెలిపారు. ఆరోగ్య శ్రీ పరిధిని 5 లక్షల నుండి 10 లక్షల రూపాయలకు పెంచి, జిల్లాలో 10,723 మందికి వైద్య సేవలు అందించడానికి 27.63 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047" ప్రణాళికలో 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధించడం లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రాన్ని గౌరవప్రదంగా ప్రపంచ వేదికపై నిలబెట్టే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తున్న ట్లు తెలిపారు. అనంతరం దేశభక్తి ఉట్టిపడేలా బాల భవన్, వివిధ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలలో పని చేసి ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఐడీఓసీలో పథకావిష్కరణ గావించిన జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ స్వాత్రంత్ర సమర యోధులకు ఘనంగా నివాళు అర్పించారు. కార్యక్రమంలో గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ శాసనసభ్యులు విజయుడు, కలెక్టర్ బి.యం. సంతోష్, ఎస్పీ శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో అలివేలు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అండగా మాజీ ఎమ్మెల్యే మర్రి



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పేద విద్యార్థుల పక్షాన నిలబడుతూ వారికి కావాల్సిన ఫీజులు చెల్లిస్తూ ఎంతోమంది పేద విద్యార్థులకు తనదైన శైలిలో సహాయ సహకారాలు అందిస్తున్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తాడూర్ మండలంలోని గోవిందాయపల్లి గ్రామానికి చెందిన ఎల్లయ్య కుమారుడు శివప్రసాద్, నాగర్‌కర్నూల్ ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ విద్యను అభ్యసిస్తున్నాడు. వారికి కళాశాల ఫీజ్ కోసం రూ. 1,40,000/- చెక్కును వారి తండ్రి ఎల్లయ్యకు అందజేశారు. అదేవిధంగా తెల్కపల్లి మండలం గట్టు రావిపాకుల గ్రామానికి చెందిన కాశన్న కుమార్తె నవ్య శ్రీ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం కాలే జ్ ఫీస్ రూ.33,500 చెక్కును అందించారు. రాబోయే 2 సంవత్సరాల కళాశాల ఫీజు కూడా తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహారెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీశైలం,మాజీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మైసమ్మ దేవాలయ వార్షికోత్సవం

**కల్వకుర్తి, ఆగస్టు 15 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ మైసమ్మ దేవాలయ 11వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, లక్ష్మి గణపతి హోమం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, టీ హబ్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు ఎడమ సత్యం, శ్రీశైలం, స్థానిక ఎస్సై మహేందర్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని, సనాతన ధర్మంలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. దేవాలయ వార్షికోత్సవ వేడుకలకు హాజరైన అతిథులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సనానమనించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, మెకానిక్ రాములు, శ్రీకాంత్, లక్ష్మినరసింహ, మధుసూదన్ రెడ్డి, రవి గౌడ్, నరసింహ, రాఘవేందర్ గౌడ్, రాంభూపాల్ రెడ్డి, కృష్ణ గౌడ్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా జిల్లా కమిటీకి సన్మానం..

**కల్వకుర్తి,ఆగస్టు 15 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్ జాతీయ జెండా ఎగరవేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ జాతీయ బీసీ కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి నూతనంగా ఎన్నికైన నాగర్‌కర్నూల్ జిల్లా బిజెపి కమిటీలో కల్వకుర్తి తాలూకా నుండి ఎన్నికైన జనరల్ సెక్రెటరీ గోరటి నరసింహ, ఉపాధ్యక్షులుగా బోడ నరసింహ, దండు శ్రీనివాస్, కార్యదర్శిగా గుర్రాల రాంభూపాల్ రెడ్డిలను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మట్ట నరేష్ గౌడ్, సీనియర్ నాయకులు బండెల రామచంద్రారెడ్డి, మాజీ జెడ్పిటిసి కండే హరిప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, సీనియర్ నాయకులు సూర్య కృష్ణ గౌడ్, నీరుకంటి రాఘవేందర్ గౌడ్, పిఏసిఎస్ సభ్యులు శ్యామ్, నరేడ్ల శేఖర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా సెక్రెటరీ ధర్మోజు నరేష్ చారి, సోషల్ మీడియా ఇన్‌చార్జి రవి రాథోడ్, పట్టణ జనరల్ సెక్రెటరీలు నాప శివ, పెద్దారి పర్వతాలు, ఉపాధ్యక్షులు కొల్లూరు శ్రీధర్, పట్టణ కోశాధికారి లక్ష్మినరసింహ, వాకిటి శ్రీకాంత్, సాయి, తోడేటి అరవింద్ రెడ్డి, పుట్ట చంద్రశేఖర్, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలకు వంట సామగ్రి వితరణ

**పెబ్బేరు, ఆగస్టు 15 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం యాపర్ల గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు అనుగుణంగా వాలంటీరును ఏర్పాటు చేయడానికి యాపర్ల గ్రామ ఆదర్శ యువజన సంఘం ప్రతినెల పదివేలు రూపాయలు ఇవ్వడానికి ముందుకు వచ్చి నేడు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బుచ్చమ్మ,స్కూల్ ప్రధానోపాధ్యాయుడు హుస్సేన్ యాదవ్‌కు రూ.10000ల నగదు అందజేయడం జరిగింది. అదేవిధంగా యాపర్ల గ్రామ దేవాలయ కమిటీ స్కూలుకు విద్యార్థులకు సరిపడా వంట సామాగ్రి ప్లేట్లు గ్లాసులు పాఠశాల యాజమాన్యానికి అందజేయడం జరిగింది. సహకరించిన దేవాలయ కమిటీకి యువజన సంఘానికి గ్రామ పెద్దలకు స్కూల్ ఉపాధ్యాయ బృందం వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

## రైతు సేవ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**దేవరకద్ర,ఆగస్టు 15 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గోప్లాపూర్ గ్రామంలో శుక్రవారం హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ రైతు సేవా కేంద్రాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవా కేంద్రం ద్వారా మెరుగైన సేవలను అందిస్తూ, రైతుల నమ్మకాన్ని పెంచేలా నిర్వాహకులు వ్యాపారం కొనసాగించాలని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఎండి సాంబశివరెడ్డి, విష్ణువర్ధన రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, అగ్రికల్చర్ ఏవో రాజేందర్ అగర్వాల్,టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, మాజీ జెడ్పిటిసి లక్ష్మీకాంత్ రెడ్డి, కురుమూర్తి, చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ముచ్చింతల వెంకటేశ్వర్రెడ్డి, మహిపాల్ రెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ప్యూరిఫైడ్ ఫిల్టర్ వితరణ

**ఉప్పునుంతల, ఆగస్టు 15 ప్రభాతవార్త :** 79వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు దాహార్తిని తీర్చేందుకు మండలంలోని పిరాట్వాన్ పల్లి మాజీ ఎంపీటీసీ బూరం మల్లేష్ అయ్యవారిపల్లి పాఠశాలకు ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్‌ను వితరణ చేశారు. తమ గ్రామంలోని పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేసిన మాజీ ఎంపీటీసీ మల్లేష్ కు ఆ పాఠశాల హెచ్ఎం జంగయ్య తో పాటు, గ్రామస్తులు వెంకట్ రెడ్డి, పర్వతాలు, నరేష్, ఉపాధ్యాయురాలు సరస్వతి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## పదవీ కాలం పొడిగించిన ప్రభుత్వం

**ఉప్పునుంతల, ఆగస్టు 15 ప్రభాతవార్త :** ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పాలకమండలి కాలపరిమితి మరో ఆరు నెలలపాటు పొడిగించిన సందర్భంగా డిసిసిబి డైరెక్టర్ , సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు,రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డా. మల్లు రవి, డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అదేవిధంగా సంఘ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రత్యేకంగా అభినందనలు తెలిపిన వారిలో డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు, పాలకమండలి సభ్యులు ఉన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

**అడ్డాకుల, ఆగస్టు 15 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వర్నె గ్రామంలో స్వతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం నాడు కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు మన్సూర్ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సుధాకర్ రెడ్డి,జనార్దన్ రెడ్డి, విజయకుమార్ శెట్టి, కళ్యాణ్ రెడ్డి, అంజన్న, బుసిరెడ్డి, బొంబాయి కొండన్న, బాలనాగన్న, రాఘవేందర్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కౌకుంట్ల పూర్వ విద్యార్థులు

### అపూర్వ విద్యార్థులే ఆపద్బాంధవులయ్యారు

**దేవరకద్ర, ఆగస్టు 15 ప్రభాతవార్త:** ఓ వ్యక్తి గాని, కుటుంబానికి గాని, కష్టం వచ్చిందంటే వారికి ఓదార్పు ఎంతో అవసరం. ఆ ఓదార్పు తల్లిదండ్రులు, సోదరులు, బంధువులు, స్నేహితులు, ఇలా పలువురి నుంచి లభించవచ్చు. కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన పూర్వ మిత్రుడు సాయన్న భార్య అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కౌకుంట్ల ఉన్నత పాఠశాలలో 2000, 2001 పదో తరగతి చదివిన సాయిన్న స్నేహితులు అందరూ కలిసి 60,000 పోగుచేసి, శుక్రవారం తమ మిత్రుడి ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందించి, ఉదారతను చాటుకున్నారు. అనంతరం చిన్నతనం నుంచి తమతో కలిసి చదువుకొని ఆటలాడిన ఓ మిత్రుడు కుటుంబం కష్టాల్లో ఉందని తెలుసుకున్న పూర్వ మిత్రులందరు తలా కొంత పోగుచేసి, వారి ఇంటికి వెళ్లి, ఆర్థిక సహాయం అందజేసి, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ మిత్రులు ఉదయ్‌కుమార్, రామకృష్ణ, భాస్కర్, నాగరాజు, నరేంద్ర ,కర్ణాకర్, నహీద్, రాజేంద్ర, తిరుపతిరెడ్డి, భాస్కర్, బాలరాజు, గౌసొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

# ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 15 ప్రభాతవార్త :** 79వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 79 సంవత్సరాల స్వాతంత్ర భారతావనిలో కాంగ్రెస్ ప్రభుత్వమే నిరుపేదలకు అండగా నిలిచిందని నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మాన్యశ్రీ రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం దినదినాభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జిల్లా నియోజకవర్గ ప్రజలకు ఆయన స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**స్వాతంత్ర్యం వల్లే స్వేచ్ఛ సమానత్వం.**

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం రావడం జరిగిందని, దానివల్లే ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, హక్కులు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ కార్యాలయ స్థలంలో, పాత మార్కెట్ యార్డ్ సమీపంలో జాతీయ జెండాను ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మరియు పార్లమెంట్ సభ్యులు మల్లు రవిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ స్వరాజ్యానికి పెద్దపీట వేయడం జరిగిందని, గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తమ సర్కారు కృషి చేస్తుందని అన్నారు. యువత అసాంఘిక కార్యక్రమాల వైపు దృష్టి సారించకుండా సమాజ సేవ కోసం దృష్టి సారించాలని కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూచుకుళ్ళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు 31 గ్రీన్ బోర్డులు, వికలాంగులకు వీల్ చైర్లు, కూచుకుళ్ళ ఫౌండేషన్ చైర్మన్ సరిత రాజేష్‌ల చేతుల మీదుగా అందించారు. విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యమని, శారీరక, అంగవైకల్యం ఉన్నవారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**జాతీయ జెండాకు వందనం చేసిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి**

బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.ఆర్.ఎస్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేసి జెండాకు సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో యువత ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్తవరం నర్సింహారెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీశైలం, మాజీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

**ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు**

**ఉప్పునుంతల, ఆగస్టు 15 ప్రభాతవార్త :** 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులచే వేకువజామున ప్రభాత భేరి నిర్వహించారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంవద్ద తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీఓ కార్యాలయం వద్ద, స్థానిక గ్రామపంచాయతీ వద్ద ఎంపీడీఓ మోహన్‌లాల్, ఎంఇఓ కార్యాలయం వద్ద ఎంఇఓ చంద్రశేఖర్,వైద్యశాలల వద్ద డాక్టర్ స్వప్న, పశువైద్యాధికారి డా. ప్రవీణ్, రైతు వేదిక వద్ద ఏఓ కొర్ర రమేష్, సింగిల్ విండో కార్యాలయం వద్ద డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై వెంకట్ రెడ్డి, డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సంఘం అధ్యక్షుడు పాతుకుల కురుమయ్య, హైస్కూల్ వద్ద హెచ్ఎం నీల శ్రీధర్, సబ్ స్టేషన్ వద్ద ఏ ఈ కొండల్, ఐకెపి కార్యాలయం వద్ద అధ్యక్షురాలు లలితమ్మ, పోస్ట్ ఆఫీస్ వద్ద పోస్టు మాస్టర్, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల వద్ద ఆయా పాఠశాలల హెచ్ఎంలు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మండల స్థాయి అధికారులు డిటి పరశు నాయక్, సీనియర్ అసిస్టెంట్ బలరాం నాయక్, పంచాయతీరాజ్ ఏఈ మహేష్, ఐకెపి బాలచందర్ , ఈజీఎస్ ఏపిఓ పర్వతాలు, ఫార్మాసిస్ట్ కుమారచారి, సింగిల్ విండో సిఇఓ కొత్త రవీందర్ రావు, నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సూరం నారాయణరెడ్డి, ఆలూరి శ్రీనివాసులు, సాయిబాబు, బీసీ సెల్ మండల నాయకులు మడ్డి తిరుపతయ్య గౌడ్, అంతటి శేఖర్ గౌడ్, పాతుకుల రామచంద్రయ్య, సిహెచ్ శీను, బొల్లె బాలయ్య, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ బొల్లె లక్ష్మయ్య, అన్ని శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు**

**బిజినపల్లి, ఆగస్టు 15 ప్రభాతవార్త :** 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలపై జాతీయ పతాకాలను ఆవిష్కరించి జాతీయ గీతాలను ఆలపించారు. తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో కథలప్ప, ఏవో కమల్ కుమార్,ఐకెపి ఏపిఎం, ఈశ్వర్, పిఆర్ డిఇ జవహర్ బాబు, ఎంఈఓ రఘునాథ శర్మ, ఎస్సై కె. శ్రీనివాస్, పిఏసిఎస్ చైర్మన్ నాయినోళ్ల బాలరాజ్ గౌడ్, పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం ఎడిఆర్ డాక్టర్ రాంప్రకాష్ కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఎందరో మహానుబావుల త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. దేశానికి త్యాగమూర్తుల చేసిన సేవలు, త్యాగాలు మరువలేనివన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



జాతీయ జెండావిష్కరణ వేడుకల్లో ఎమ్మెల్యే, ఎంపీ



స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రధాన అతిథి ఖవాజా బహా ఉదీన్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



జాతీయ పతాకానికి గౌరవ వందనం



కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే



ఆత్మకూరులోని మార్కెట్ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న మార్కెట్ చైర్మన్



తహసిల్దార్ కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసిన నిర్వాహకులు పి.వెంకటయ్య



వెల్దండలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



వంగూరులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



అంగన్‌వాడి కేంద్రంలో స్వాతంత్ర వేడుకలు



జాతీయ జెండా ఎగుర వేస్తున్న తహసీల్దార్ ప్రమీల

**వాడ వాడన రెపరెపలాడిన మువ్వెన్నల జెండా**

**కల్వకుర్తి, ఆగస్టు 15, ప్రభాతవార్త:** 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలతో పాటు వివిధ పార్టీల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, మున్సిపాల్ కార్యాలయంలో, మార్కెట్ యార్డ్, ప్రభుత్వాసుపత్రిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జనార్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకట్రాములు, తహసీల్దార్ కార్యాలయం ముందు తహసీల్దార్ ఇబ్రహీం, కోర్టు ఆవరణలో న్యాయమూర్తి శ్రీదేవి, పోలీస్‌స్టేషన్ కార్యాలయం ముందు ఎస్ఐ మాధవరెడ్డి, డీఎస్పీ కార్యాలయం ముందు డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ కార్యాలయం ముందు సీఐ నాగార్జున, కల్వకుర్తి డిపో కార్యాలయంలో డిపో మేనేజర్, అగ్రికల్చర్ ఏడీఏ కార్యాలయం ముందు ఏడీఏ శ్రీనివాసులు, ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ శంకర్, లయన్స్‌క్లబ్ వద్ద లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చిగుళ్లపల్లి శ్రీధర్, పీఏసీఎస్ కార్యాలయం వద్ద పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధనరెడ్డి, గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల అధ్యక్షతన జాతీయ జెండాను ఎగురవేశారు. గొర్రె కాపరుల భవనం, నాయి బ్రాహ్మణ భవనం, శ్రీకృష్ణ భవనం, ఓల్డేజ్ హోం వద్ద ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ హజరై జెండావిష్కరణ గావించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు,కళాశాలల ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు.

**వాసవీక్లబ్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ**

79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కల్వకుర్తి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్ నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో జెండావిష్కరణగా వించారు. అంతకు ముందు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే నేటి స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు అన్నారు. కార్యక్రమంలో వైస్‌గవర్నర్ కలిమిచర్ల రమేష్‌తో వనితక్లబ్ అధ్యక్షురాలు బాదం ధనలక్ష్మి, మాజీ అధ్యక్షులు ఇరువెంటి రమేష్,శివ జగదీశ్వర్, కలిమిచెర్ల గోపాల్, దాచేపల్లి మనోహర్,గుగ్గిళ్ళశంకర్,కూన సంతోష్, జూలూరు సత్యం,చిదరే శ్రీనివాస్,మాచిపెద్ది అశోక్,లావణ్య చిగుళ్లపల్లిశ్రీధర్,కార్యదర్శి నీల కోటేశ్వర్,స్రవంతి, కోశా ధికారి మాచిపెద్ది రవి, కల్పన, కల్వ మనోహర్, కొందూరు కృష్ణయ్య, వాసవి క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**మండల కార్యాలయాలలో ఘనంగా స్వాతంత్ర వేడుకలు**

**దేవరకద్ర తాహసిల్దార్ కృష్ణయ్య, మండల ఎంపీడీవో శ్రీనివాస్ రావు**

**దేవరకద్ర, ఆగస్టు 15 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఎంపీడీవో కార్యాలయంలో 79వ స్వాతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మండల తహసిల్దార్ కృష్ణయ్య,ఎంపీడీవో శ్రీనివాసరావు, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్, ఎంపీడీవో, మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగం ద్వారా సిద్ధించిన ఫలితాలను నేడు మనం పొందుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, తహసిల్దార్ సిబ్బంది ,మండల ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడి కార్యాలయంలో ..**

కౌకుంట్ల మండల కేంద్రంలో అంగన్వాడి కార్యాలయంలో 79వ స్వాతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో అంగన్వాడీ టీచర్ సుమలత జాతీయ జెండా త్రివర్ణ పతాకాన్ని ఎగరవేశారు. విద్యార్థులకు, ప్రజలకు, యువకులకు, స్వీట్లు పంచారు. స్వాతంత్రం రావడానికి అమరులైన పలువురు స్వతంత్ర సమరయోధులను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ వరలక్ష్మి, పార్వతి, ఆయలు రిజ్వాన,ముత్యాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ బాలుర 1 - స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**జడ్చర్ల, ఆగస్టు 15 ప్రభాతవార్త :** జర్చర్లలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ బాలుర 1లో శుక్రవవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం జాతీయ పతాకాలతో, పూలతో అలంకరించబడింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోషకులు దేశభక్తి నినాదాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఖవాజా బహా ఉదీన్ (ఆర్ఎల్‌సి న్యూ పార్టిసిపేషన్) హాజరై, విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. ఆటలు, రచన, ప్రసంగ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు, నృత్యాలు, నాటికలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పారిజాత, అర్శ ఖాతున్ కో ఆర్డినేటర్ ఖవాజా ఖాన్, పిఇటి శివప్రసాద్,మునావర్‌సుల్తానా, సరళ, సుష్మిత, అమీర్‌బాబా,ముహమ్మద్ దస్తగిర్ డిప్యూటివార్డెన్ పోషకులు మరియు అనేకమంది పాల్గొన్నారు.

**ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**వెల్దండ, ఆగస్టు 15 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెల్దండ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దార్ కార్తీక్ కుమార్, సిఐ కార్యాలయం సిఐ విష్ణువర్ధన్ రెడ్డి, స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ కురుమూర్తి, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మోతిలాల్‌నాయక్, గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి గిరి, జడ్పీహెచ్ఎస్ పాఠశాల వద్ద రవీందర్, మిల్క్ సెంటర్ వద్ద ఎండి.యాకూబ్, మైనార్టీ సంఘం వద్ద ఎండి.రషీద్, బీసీ హాస్టల్ వద్ద వార్డెన్ శ్రీరామ్, పిఏసిఎస్ వద్ద చైర్మన్ జూపల్లి భాస్కరరావు, పశువైద్యశాల వద్ద డాక్టర్ శ్యాంసుందర్, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో శోభారాణి, రిక్రెషన్ క్లబ్ వద్ద అధ్యక్షులు శ్రీనివాసులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్ యాదవ్, మాజీ ఎంపీపీ జయప్రకాష్, రాజేందర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎర్ర శ్రీను ముదిరాజ్, శంకర్‌నాయక్, యాదగిరి, నారాయణ, పుల్లయ్యతో పాటు గ్రామ ప్రజలు పుర ప్రముఖులు ఉన్నారు.

**ఆత్మకూరులో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు**

**ఆత్మకూర్ ఆగస్టు 15, ప్రభాతవార్త;** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ కార్యాలయాలలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో తాసిల్దార్ చాంద్ పాషా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆత్మకూరు మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్ పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో సీఐ శివకుమార్ తదితరులు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జాతీయ పతాకాలను ఎగురవేశారు. అంతకుముందుగా పట్టణంలోని మార్కెట్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ చైర్మన్ రహమతుల్లా జాతీయ పతాకాన్ని ఎగురవేసి పలువురిని ఉద్దేశించి ప్రసంగించారు అంతేకాకుండా ఉదయం తెల్లవారు జాము నుంచే పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ భేరీ నిర్వహిస్తూ పట్టణంలో భార్యా ప్రదర్శన నిర్వహించారు. ప్రత్యేకించి ఎన్వి రామన్ పాఠశాల, శ్రీవాణి పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి విద్యార్థిని విద్యార్థులు సంస్కృతిక ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకర్షించాయి.

**రెపరెపలాడిన మువ్వన్నెల జెండా...**

**వంగూరు,ఆగస్టు15 ప్రభాతవార్త:**స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా వంగూరు మండలంలోని 27 గ్రామ పంచాయతీలలోని ప్రభుత్వ కార్యాలయాలలో, యువజన సంఘాలు, వివిధ పార్టీల కార్యాలయాల ముందు జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయం ముందు తహసీల్దార్ మురళీమోహన్, పోలీస్‌స్టేషన్ ముందు ఎస్ఐ మహేష్, మండల పరిషత్ కార్యాలయం ముందు ఎంపీడీఓ బ్రహ్మచారి, ఉప్పల్‌పహడ్ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ప్రత్యేక అధికారి డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి లు జాతీయ జెండాను ఎగరవేశారు. వివిధ కుల సంఘాల భవనాల ముందు ఆ సంఘం అధ్యక్షులు జాతీయ జెండాలనువ్వు ఎగురవేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**జీవిత భీమా ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ**

**గద్వాల టౌన్ , ఆగస్టు 15, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జీవిత బీమా సంస్థ ఆధ్వర్యంలో ఎల్ఐసి బ్రాంచ్ ఆఫీస్ ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ శ్రీ కులశేఖర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏజెంట్ శ్రీనివాస్ గౌడ్. లియాపీ సెక్రెటరీ మురళీకృష్ణలు ప్రసంగించారు. అదేవిధంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్‌యూనియన్ గద్వాల బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు మాట్లాడుతూ మన దేశం అంటే కేవలం ఒక భూభాగం కాదు కోట్లాది గుండెలు పంచుకునే పండుగ అని అన్నారు. స్వేచ్ఛ అనేది మనకు సులభంగా రాలేదు అది అమరుల రక్తంతో వారి నిస్వార్థంతో త్యాగాలతో సాధించుకున్న వరం దీనిని మన మందరము గుర్తుంచుకోవాల్సిన దినం అన్నారు. రంగులు వేరైనా మతం వేరైనా మన అందరి గమ్యం ఒక్కటే మన జెండాలోని మూడు రంగుల లాగానే మనం కూడా కలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ క్లాస్ టు క్లాస్ త్రీ ఉద్యోగస్తులు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధి రంగాలను ఏర్పాటు చేసుకోవాలి

● వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**పెబ్బేరు, ఆగస్టు15 ప్రభాతవార్త:** పెబ్బేరు మండల కేంద్రానికి చెందిన క్రికెట్ కోచర్ శంకర్ పెబ్బేరు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న స్పోర్ట్స్ షాపును శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యతోపాటు విద్యార్థులకు క్రీడపై కూడా పట్టుండాలని క్రికెట్ క్రీడల్లో తర్ఫ్యాజ్ నిచ్చే శంకర్ స్వయంగా తానే స్పోర్ట్స్ షాప్‌ను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే శంకర్ను అభినందించారు యువకులు ఉన్నత చదులతో పాటు ప్రభుత్వపరమైన ఉద్యోగ సాధన కోసం ప్రయత్నిస్తూనే స్వయం ఉపాధి రంగాలను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పెబ్బేరు వ్యవసాయ మార్కెట్‌యార్డ్ అధ్యక్షులు ప్రమోదినిరెడ్డి, ఉపాధ్యక్షులు విజయ వర్ధన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, పెబ్బేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్రాములు, దయాకర్‌రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, గంధం రాజశేఖర్, యుగంధం రెడ్డి, భాను ప్రకాష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎ.పి జితేందర్ రెడ్డి



సాంకేతిక యంత్రాన్ని స్విచ్ ఆన్ చేస్తున్న ఎ.పి జితేందర్‌రెడ్డి

**గద్వాల టౌన్, ఆగస్టు15, ప్రభాతవార్త:** గద్వాల్ శివారులోని ఏటిసి అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్‌బి.యం.సంతోష్, గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృ మోహన్‌రెడ్డి తో కలిసి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి సలహాదారు ఏ.పి. జితేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం టాటా సంస్థల సహకారంతో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు ఆధునిక శిక్షణ అందించడంలో కీలక పాత్ర వహిస్తుందని తెలిపారు. భవన నిర్మాణ పనులు నాణ్యతతో, నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణ పనులు పూర్తయిన తరువాత సంబంధిత పరికరాలు అందుబాటులో ఏర్పాటు చేసి, యువతకు 6 రకాల ట్రేడ్ కోర్సుల్లో శిక్షణ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన ఏ టి సి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, గద్వాల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ నల్లహనుమంతు, సహాయ లేబర్ కమిషనర్ మహేష్ కుమార్, జిల్లా ఎంప్లాయి మెంట్ అధికారి ప్రియాంక, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## జయ రామాయణం పుస్తక ఆవిష్కరణ

**శ్రీరంగాపూర్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** విశ్రాంత తెలుగు ఉపన్యాసకురాలు పాలమూరు నివాసి అయిన కవయిత్రి చుక్కాయపల్లి జయ లక్ష్మమ్మ గారు రచించిన "జయ రామాయణం " పుస్తకావిష్కరణ అంగరంగ వైభవంగా జరిగింది. జయలక్ష్మి శ్రీరంగాపురం వాస్తవ్యులైన చుక్కయ్య పల్లి శ్రీనివాసాచార్యులు సీతమ్మ గార్ల జేష్ట పుత్రిక కవయిత్రి జననం విద్యాభ్యాసం శ్రీరంగాపురంలోనే జరిగాయి. మనసుకు వయసుతో నిమిత్తం లేదని నిరూపిస్తూ విజయ లక్ష్మమ్మ తన డెబ్బై మూడు సంవత్సరాల వయసులో శ్రీవాల్మీకి విరచిత రీమాయ నాన్ని 1760 తేటగీతి పద్యాల్లో అనువదించారు. జయ రామాయణం కావ్యమే గాక సుదీర్ఘ శతకం ప్రతిపద్యానికి చివర రా!రఘు రా! రఘు రా! జానకి రామ రా! అనే మకుటంతో బాసిల్లుతున్నది. ఈ మహాకవ్యం పుస్తకావిష్కరణ తెలంగాణలో రంగనాయక స్వామి వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీరంగాపురం ఆలయంలో జరిగింది ఈ కార్యక్రమానికి ప్రసన్నలక్ష్మి అధ్యక్షత వహించగా అవధానిని చుక్కయ్య పల్లి శ్రీదేవి పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో వంగిపురం ప్రవీణ్ కుమార్ శ్రీవిద్య గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ జిహెచ్‌ఎంసి వి.ప్రశాంతి, రవిప్రకాష్, విప్రసన్నలక్ష్మిలతో నూతన వధూవరులు కోడి చర్ల మాధవన్, దీక్షితలు పాల్గొన్నారు.

## పాఠశాలకు ప్రింటర్ వితరణ

**నర్వ, ఆగస్టు 15 ప్రభాతవార్త:** నర్వ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2010,11 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు 23 వేల రూపాయలు విలువగల ప్రింటర్ ను శుక్రవారం అందజేశారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమం గోడల హరీష్ ఆధ్వర్యంలో వారి మిత్ర బృందం ప్రధానోపాధ్యాయులు పి. మధుసూదన్ కి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ మాట్లాడుతూ విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రింటర్ అవసరమని కోరిన వెంటనే బహుకరించిన 201011 పూర్వ విద్యార్థులకు పాఠశాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న గ్రామస్తులు, వారు చూపిస్తున్న ఆదరాభిమనాలు, మా విద్యార్థుల చదువుకు ఇస్తున్న ప్రోత్సాహం మరువలేనిది అన్నారు. విద్యార్థులందరూ మంచి చదువులు చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకొని తాము చదువుకున్న పాఠశాలకు, గ్రామానికి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేష్, మన్యం, రాజు, ప్రకాష్, శ్రీశైలం, శ్రీనివాసులు, మురళిప్రసాద్, విజయలక్ష్మి, స్నేహ, అబ్దుల్ సలీం, సురేష్, స్వరూప, పూర్వ విద్యార్థులు భార్గవ్, నరేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో గ్రామీణ కళాకారులకు ప్రోత్సాహం

◆ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ◆ మంత్రి చేతుల మీదుగా డీజే పాట విడుదల



డిజె పాట ఆవిష్కరిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

**నర్వ, ఆగస్టు 15 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా నర్వ మండలం కల్వాల గ్రామానికి చెందిన ప్రతిభావంతుడైన కే మల్లేష్‌తన సొంత యూట్యూబ్ ఛానెల్ ఎమ్ టీవీ మ్యూజిక్ ద్వారా రూపొందించిన డీజే పాటను రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల కళాకారులు, జానపద పాటలను ప్రోత్సహించడం ఎంతైనా ఉండన్నారు. కల్వాల లాంటి చిన్న మారుమూల గ్రామం నుండి జానపద పాటలను నిర్మించే స్థాయికిమల్లేష్ ఎదగడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఎమ్ టీవీ మ్యూజిక్ ఛానెల్ ద్వారా విడుదలైన ఈ డీజే పాట మంచి ప్రజాదరణ పొంది, ఎక్కువ వ్యూస్ సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ పాట గ్రామీణ ప్రతిభకు ఒక మంచి ఉదాహరణగా నిలిచిందన్నారు. ఈ పాట విడుదల కార్యక్రమంలో ఊట్కూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్ రెడ్డి, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బి. చెన్నయ్య సాగర్, ఉపాధ్యక్షుడు శరణ్, నాయకులు వెంకటేష్‌గౌడ్, కోరం మహేష్‌గౌడ్, కల్వాల గ్రామ నాయకుడు బి.నర్సిములు, చంద్రకాంత్ (బబ్లూ), యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

**దామరగిద్ద, ఆగస్టు 15 ప్రభాతవార్త:** స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా దామరగిద్ద లయన్స్ క్లబ్ తరఫున కానుకుర్తి, విఠలాపూర్ ,ఉలిగుండం గడి మునుకానుపల్లి, గత్పా, గ్రామాలలో పనిచేస్తున్నటువంటి పారిశుద్ధ కార్మికులకు నిత్యవసర సరుకులు రగ్గులు శాలువాతో సన్మానించడం జరిగింది. గ్రామాలు శుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ కార్మికుల పాత్ర కీలకము కాబట్టి వారి సేవలను గుర్తించి లయన్స్ క్లబ్ వారిచే వారిని సన్మానించడం జరిగింది. దాదాపు 40 మంది పారిశుధ్య కార్మికులను ఈరోజు సన్మానించి వారి సేవలను కొనియాడం జరిగింది రాబోయే రోజుల్లో మండలంలోని ప్రతి గ్రామంలో గల పారిశుధ్యకార్మికులను సన్మానించడం జరుగుతుందని లయన్స్ క్లబ్ అధ్యక్షులు శీలం బాసిరెడ్డి తెలియజేశారు కార్యక్రమంలో కార్యదర్శి అశోక్, లయన్స్ క్లబ్ సభ్యులు నారాయణపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు సరిత హరినారాయణ, లయన్స్ క్లబ్ సభ్యులు రవికుమార్‌గౌడ్ గారు భీమయ్య గౌడ్ గారు, తిప్పన, కన్కిరెడ్డి, నరసప్ప, వెంకట్రెడ్డి ,తమ్మలి వెంకట్ ములు, సుభాష్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీశ్రీశ్రీ గెల్వాలాంబ అమ్మవారి ఉత్సవాలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

**వంగూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త:** అమ్మ కరుణరూపిణి నీ చల్లని చూపులతో కరుణించే తల్లివై మా కష్టాలను కడతేర్చి, మమ్ము గెలిపించే గెల్వాలాంబ మాతగా అవతారమెత్తిన అమ్మ అందుకో మా నైవేధ్యాలు అంటూ శ్రీశ్రీశ్రీ గెల్వాలాంబ మాతకు ముదిరాజ్ కులస్థులు శుక్రవారం బోనాలు, శ్రీశ్రీశ్రీ గెల్వాలాబ మాత బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మ వారికి కుంకుమార్చనలు, ప్రత్యేక అలంకరణలతో పాటు అమ్మవారి ఆలయం చుట్టు కాడేద్దుల బండ్లతో వివిధ వాహనాలతో తిప్పుతూ భక్తులు సంతోషాలను వ్యక్తం చేస్తున్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, వ్యవసాయ కమిషన్ సభ్యులు కెవిన్ రెడ్డిలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నకినమోని శేఖర్ ముదిరాజ్ ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానం చేశారు. ముదిరాజ్ బోనాల ముందు పూనకంతో మహిళలు ఊగుతూ పురవీధుల గుండాబోనాలు, గంధ దీపాలతో ఊరేగింపుగా వచ్చి హనుమాన్ దేవాలయం వద్ద ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆలయం చుట్టు బోనాలను తిప్పుతూ అమ్మవారికి బోనాలను సమర్పించారు. ముదిరాజ్ కులస్థుల బోనాలకు ఆలయ చైర్మన్ నకినమోని శేఖర్ ముదిరాజ్ స్వాగతాలు పలుకుతూ ధన్యవాదాలు తెలిపారు. పోలీసుల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకో కుండా పోలీసులు బందోబస్తు జాగ్రత్తలు చర్యలు చేపట్టారు.

## శ్రీశ్రీశ్రీ గెల్వాలాంబ అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి



మాజీ ఎమ్మెల్యే మర్రికి స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ చైర్మన్

**వంగూరు, ఆగస్టు15 ప్రభాతవార్త:** శుక్రవారం వంగూరు మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ గెల్వాలాంబ మాత బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారిని దర్శించుకునేందుకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే మర్రికి ఆలయ అర్చకులు, దేవాలయ చైర్మన్ నకినమోని శేఖర్ ముదిరాజ్ పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ సిబ్బంది శాలువా పూలమాలతో సన్మానించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని హామీలపై ధ్వజమెత్తి ప్రజలకు అండగా నిలిచి ప్రజల పక్షాన పోరాడుతామని ఆయన పేర్కొన్నారు. అచ్చంపేట గడ్డపై అమ్మవారి అనుగ్రహంతో గులాబీ జెండాను ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే బలమని కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచి వారికి అన్ని విధాలా తోడుంటానని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ మండలఅధ్యక్షులు గణేష్‌రావు, నరేందర్‌రావు, అచ్చంపేట మండల పార్టీ అధ్యక్షులు పర్వతాలు, నాయకులు కర్ణాకర్ రావు, నరసింహగౌడ్, ప్రవీణ్ రెడ్డి, కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు అంకు సురేందర్, ఎల్లా గౌడ్, డిండి బాలస్వామి గౌడ్, అంజి సాయిలు, నరసింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శివ, శ్రీశైలం, నిరంజన్, మురళి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే సమాజంలో గుర్తింపు

**- కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్**

**కల్వకుర్తి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** విద్యార్థినిలు చదువులో నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకొని అధిరోహించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని మైనార్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ వార్షిక ఫలితాలలో ఉత్తీర్ణత సాధించిన బైపిసి టాపర్స్ సమీరా, యాస్మీన్, రాణి, భవ్య, ఎంపీసీ టాపర్స్ హరిణి, సమ్రీన్ మాసూమ్, యాస్మీన్ బేగం, ద్వితీయ సంవత్సరం బైపిసి టాపర్స్ ముస్కాన్ ఖాతున్, అక్షయ, అయేషా సిద్ధికా, రెహానా బేగం, ఎంపీసీ టాపర్స్ సమ్రీన్, హన్సిక, ముస్కాన్‌లకు శాలువాలతో సన్మానించి కాంగ్రెస్‌పార్టీ పట్టణ మైనార్టీ నాయకుడు మొహమ్మద్ సోఫి సమకూర్చిన నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల స్థాయి నుంచే నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకోని అధిరోహించిన్నప్పడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తూ, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తున్న మౌళిక వసతులను విద్యార్థినులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చంద్రకళ, అధ్యాపక సిబ్బంది తో పాటు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మసూద్, మాజీ కౌన్సిలర్లు షేక్ ఏజాస్, బాలునాయక్, చిత్తారి శీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాండు రంగారెడ్డి, పుస్తకాల రాహుల్, సంతుయాదవ్, ఆరిఫ్, జిలాని, పడకంటి వెంకటేష్, దున్నసురేష్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

■ దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి



రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**చిన్నచింతకుంట, ఆగస్టు15 ప్రభాతవార్త:** రైతు సంక్షేమానికి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తూ పెద్దపీట వేసిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లాల్ కోట గ్రామంలో హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీరైతు సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని, ఎవరైనా కృత్రిమ సమస్య సృష్టిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. హాకా రైతు సేవా కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలనిఆయన సూచించారు. ప్రభుత్వ నిర్దేశించిన ధరలకే ఎరువులను అందిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కథలప్ప, పార్టీ మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, ముచ్చింతల సింగిల్ విండో చైర్మన్ ఉమామహేశ్వర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ గౌని గోవర్ధన్‌రెడ్డి, నాయకులు వట్టెం శివకుమార్, తెలుగువెంకటేష్, శివకుమార్ ,మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, కావలి కృష్ణయ్య, వెంకటేష్ ,అహ్మద్ రైతు సేవ కేంద్రం యజమాని నరేష్‌గౌడ్, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిట్టెం నర్సిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డిలకు నివాళులర్పించిన రాజ్ కుమార్‌రెడ్డి

**నారాయణపేట, ఆగస్టు 15 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ కేంద్రంలోమాజీ ఎమ్మెల్యే దివంగత చిట్టెంనర్సి రెడ్డి 20వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఉన్న చిట్టెం నర్సి రెడ్డి విగ్రహానికి ఫౌండేషన్ సభ్యులతో కలిసి భీమ్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె.రాజ్ కుమార్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చిట్టెంనర్సి రెడ్డి సేవలను ఆయన కొనియాడారు. అదే విధంగా న్యాగంజ్ సమీపంలో ఉన్నదివంగత చిట్టెం వెంకటేశ్వరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, బాలాజీ, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్ గౌడ్, సల్లవెంకటేష్, శివరాజ్, వెంకటరావు, రాజప్ప, నర్సింహ నాయుడు, అశోక్, ఎం.సంతోష్, నందుకుమార్, నర్సింహ, శ్రీనివాస్, జేకే.అనిల్, నాగురావు, వాచ్యానాయక్, బాలునాయక్, మోహన్‌నాయక్, చందునాయక్, గణేష్ నాయక్ ఉన్నారు.



## నూతన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రారంభం



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

**గద్వాలటౌన్ , ఆగస్టు 15, ప్రభాతవార్త:** విద్యార్థుల సంక్షేమం కోసం అవసరమైన అన్ని సౌకర్యాలను అందిస్తూ, ప్రభుత్వం విద్యా రంగాన్ని అభివృద్ధి చేస్తోందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. శుక్రవారం గద్వాల్ కేంద్రంలోని పిల్లిగుండ్ల కాలనీ లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగారాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టి, విద్యార్థుల అభివృద్ధి, వారి భవిష్యత్తు కోసం కొత్త పాఠశాలలను ప్రారంభిస్తోందని తెలిపారు. గద్వాల్ వేగంగా అభివృద్ధి చెంది విస్తరిస్తున్న నేపథ్యంలో, పాఠశాలలకు దూరంగా ఉన్న ప్రాంతాల విద్యార్థుల సౌకర్యార్థం జిల్లాలో గుర్తించిన ఆరు ప్రదేశాల్లో ఒకటైన పిల్లిగుండ్ల కాలనీలో ఈ రోజు కొత్త పాఠశాలను ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న ఈ పాఠశాలకు త్వరలో ప్రభుత్వ నిధులతో శాశ్వత భవనం నిర్మించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, 79వస్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం విద్యా వ్యవస్థ, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమున్నప్రాంతాల్లో పాఠశాలలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, గద్వాల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ నల్లహనుమంతు, మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ హంపయ్య, ఉపాధ్యాయులు రేఖ, పరుశరామ్, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంతో నిండు ప్రాణాన్ని కాపాడండి



**అయిజ ఆగస్టు 15, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఒక నిండు ప్రాణాన్ని కాపాడాలని ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లానాయకులు ఎండి తాహేర్‌పేర్కొన్నారు. శుక్రవారం స్వతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సాయి శివ హాస్పిటల్, బ్రహ్మరెడ్డి ప్రజా వైద్యశాల ప్రాంగణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మహా రక్తదాన శిబిరంలో సుమారు 40 మంది యువకులు పాల్గొని రక్తం డొనేట్ చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల ఏదో కార్యక్రమంతో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఇందులో భాగంగా ఐజ పట్టణంలో స్వచ్ఛందంగా రక్తదానం ఇచ్చేందుకు యువకులు ముందుకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సాయి శివ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అబులేష్, ఇండియన్ రెడ్‌కలర్ సొసైటీ వైద్య సభ్యులు, స్థానిక స్వచ్ఛంద సేవా నాయకులు, రక్త దాతలు పాల్గొన్నారు.

## నేడు మండలానికి ఎంపీ డీ.కే అరుణ రాక

**చిన్నచింతకుంట, ఆగస్టు 15 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి డికె అరుణ రానున్నారని దేవరకద్ర అసెంబ్లీ కన్వీనర్ కురువ రమేష్, బిజెపి మండల అధ్యక్షులు దశరథ్‌లు తెలిపారు. మండల కేంద్రంలోని వాల్మీకి, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి ఆమె హాజరవుతారని వారు తెలిపారు. వాల్మీకి, ముదిరాజ్‌కులస్తులు, బిజెపి నేతలుఅధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

## ఎమ్మెల్సీని కలిసిన దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర, ఆగస్టు 15 ప్రభాతవార్త:** స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన దేవరకద్ర ఎమ్మెల్యే జిమధుసూదన్‌రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం 79వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి. తదనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్‌కు, పోలీస్ అధికారులు, పూలబుకేతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాగృతి నారాయణ పేట జిల్లా అధ్యక్షుడిగా గవినోళ్ళ శ్రీనివాస్

**దామరగిద్ద, ఆగస్టు 15 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర జాగృతి కమిటీల నియామకంలో భాగంగా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నారాయణపేట జిల్లాకు నూతన జాగృతి అధ్యక్షుడిగా దామరగిద్ద మండలం బాపనపల్లి మాజీ సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్‌ని నియమించారు. పలు సామాజిక సేవా కార్యక్రమలు నిర్వహిస్తున్నందువలన శ్రీనివాస్ నియమించినట్లు కవిత పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు మండల యువకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## వైభవంగా వరలక్ష్మి వ్రతం

**ఊట్కూర్, ఆగస్ట్ 15 ప్రభాతవార్త:** శ్రావణమాసం సందర్భంగా మండల కేంద్రంలోని భవాని దేవాలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతంతో పాటు భవాని మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వరలక్ష్మి వ్రతంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన చేసి, ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రతి శ్రావణ మాసంలో వరలక్ష్మి వ్రతం ఆచరిస్తే అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పురోహితుడు సర్వోత్తమ్ చారి భక్తులకు ఉపదేశించారు. మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించగా, వ్రతంలో పాల్గొన్న మహిళలకు తీర్థప్ర సాదాలు పంపిణీ చేశారు. అనంతరం ముత్తయిదుకార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమంలో ఎస్.ఎస్.కే సమాజ్ అధ్యక్షుడు అశోక్ కుమార్ చౌదరి, మహిళా అధ్యక్షురాలురాధా ప్రకాష్, గోపాల్‌రావు, కళావతి, కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ డ్రైవర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**నారాయణపేట, ఆగస్టు 15 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ భవన్‌లో తుఫాన్, కారు డ్రైవర్స్ జిల్లా జనరల్ బాడీ మీటింగ్ శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బి. నరసింహ టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్ హాజరై మాట్లాడుతూ తుఫాను డ్రైవర్స్ కు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 2019లో రోడ్ సేఫ్టీ బిల్లు తీసుకురావడం జరిగింది. ఈ రోడ్డు సేఫ్టీ బిల్లు వల్ల రవణ రంగంలో పనిచేసే కార్మికులకు ఇబ్బందికి గురి చేసే అంశాలు ఉన్నాయి. సిగ్నల్ జంపు చేస్తే 2000 జరిమానా, రాంగ్ రూట్లో వెహికల్ వెళ్లిన వెయ్యి రూపాయలు ఫైన్, అనుకోకుండా ఏ వెహికల్ వచ్చి గుద్దుకొని, ఆ డ్రైవర్ ది తప్పు లేకున్నా ఐదు సంవత్సరాలు జైలుశిక్ష 10000జరిమానా లాంటి అనేక విషయాలు ఈ చట్టంలో పొందుపరచడం జరిగింది. ఈ రోడ్డు షిఫ్ట్ బిల్లును వ్యతిరేకించాలని అన్నారు. స్వాతంత్రం రాకన్నా ముందు ఉన్న 44 చట్టాలను నాలుగు కోడ్స్ గా తీసుకొచ్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చే చట్టాలను కుదించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బలరాం, కెంచ నారాయణ, తుఫాన్ అండ్‌కారు డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకటయ్య, కార్యదర్శి బాలకృష్ణ ఉపాధ్యక్షులు అంజి, సహాయ కార్యదర్శి సంతోష్, కోశాధికారి అంజి, తుఫాన్ అండ్ కారు డైవర్స్ మరియు పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సాయి, టియుసిఐ హాజీ మలాంగ్, వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బూట్లు పంపిణీ

**లింగాల, ఆగస్టు15 ప్రభాతవార్త:** మండలంలోని రాయవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉల్లంగోడ్ల రాజు గ్రామస్తులతో కలిసి విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని టీపీసీసీ ఉపాధ్యక్షులు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, రాష్ట్ర సీనియర్ నాయకులు రంగినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పాఠశాలలో చదువుతున్న 50 మంది విద్యార్థులకు బూట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. పాఠశాల బలోపేతానికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జాతరకు ప్రత్యేక బస్సులు

**నారాయణపేట, ఆగస్టు 14 ప్రభాతవార్త:** నారాయణపేట మండల పరిధిలోని అభంగాపూర్ గ్రామంలో నేడు కనకాద్రి లక్ష్మినరసింహ స్వామి జాతర సందర్భంగా నారాయణపేట నుండి అభంగాపూర్ వరకు స్పెషల్ బస్సులు నడపబడును కావున భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోగలరని తెలిపారు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈ బస్సు సౌకర్యము కల్పించడం అయినది డిపో మేనేజర్ లావణ్య తెలియజేశారు.

## నేడు ఆంజనేయస్వామి ఉత్సవాలు

**మద్దూర్, ఆగస్టు15 ప్రభాతవార్త :** మద్దూరు మండల కేంద్రంలోని పాతబస్టాండ్ అంజనీయస్వామి ఉత్సవాలు శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ముష్టి సర్వములు శుక్రవారం రోజు తెలిపారు. ఉదయం జల్ది ఉరేగింపులో హనుమాన్ శోభాయాత్ర, ఉంటుందని తెలిపారు. ఈ యాత్రంలో పాల్గొన ప్రతి ఒక్కరికటోపి, హనుమాన్‌నందా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. యాత్ర అనంతరం స్వామిక అభిషేకానంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే. 5 కటపట్ట కార్యక్రమం. రాకీ శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## పేటలో నేడు, రేపు విద్యుత్ అంతరాయం

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలో నేడు, రేపు రెండు రోజులు ఉదయం 11 గంటల నుండిమధ్యాహ్నం 3 గంటల వరకు చౌక్ బజార్ మరియు సరాఫ్ బజార్ ప్రాంతాల్లో విద్యుత్తు మరమ్మతు పనుల కారణంగా అంతరాయం ఉంటుందని స్థానిక మహేష్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే బీసీ కాలనీ విద్యుత్ నియంత్రించే మరమ్మత్తు పనులునిర్వహిస్తున్నందునఈ మూడు ప్రాంతాల కాలనీవాసులకు మాత్రమే విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ పేర్కొన్నారు. కావున విద్యుత్తు మరమ్మత్తు పనులు కారణంగా ఏర్పడే అసౌకర్యానికి స్థానిక ప్రజల సహకరించాలని ఆయన కోరారు.





జెండావిష్కరణ ఆవిష్కరిస్తున్న నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్





జెండావిష్కరణ ఆవిష్కరిస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

## ఉమ్మడి జిల్లాలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**భూత్పూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం భూత్పూర్ పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ నూరుల్ నజీబ్ జాతీయ జెండానెగుంవేశారు. వెటర్నరీ కార్యాలయం వద్ద పశువైద్యాధికారి డాక్టర్ మధుసూధన్, సింగిల్ విండో కార్యాలయం వద్ద విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి, ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఎంఈఓ ఉషారాణి, ఎంపిపి కార్యాలయం వద్ద ఎంపీడీఓ ప్రభాకరాచారి, పీహెచ్‌సీ వద్ద ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్, తహసిల్ కార్యాలయం వద్ద తహసిల్దార్ కిషన్‌నాయక్ జాతీయ జెండా ఎగురవేయగా, డీటీ గీత పాల్గొన్నారు..పోలీస్ స్టేషన్ వద్ద సీఐ రామకృష్ణ జాతీయ జెండానెగురవేయగా, ఎస్సై చంద్రశేఖర్ ఇతర ఏఎస్సైలు పాల్గొన్నారు. సీఐటీయూ భవననిర్మాణ కార్మికుల సంఘం కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాంమ్మోహన్‌తో పాటు భవననిర్మిణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యేశమోని శ్రీనివాసులు వీటతో పాటు వివిధ పాఠశాలల్లో ఆయా ప్రధానో పాధ్యాయలు, ప్రిన్సిపాళ్లు జాతీయ జెండానెగుర వేశారు. జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద హెచ్ఎం ఆనందమ్మ, ఠాగూర్ మెమోరియల్ స్కూల్ వద్ద కరస్పాండెంట్ గొడుగు వెంకటయ్య జాతీయ జెండానెగురవేయగా, ప్రిన్సిపాల్ కాద్లూర్ చాముండేశ్వరి పాల్గొన్నారు. సాహితీ హైస్కూల్ వద్ద కరస్పాండెంట్ సత్యనారాయణ(సత్యం), న్యూ ఎరా హైస్కూల్ వద్ద కరస్పాండెంట్ వెంకట్ క్రాంతికుమార్, దయానంద విద్యామందిర్ వద్ద కరస్పాండెంట్ సురేందర్, కరివెన మదర్‌థెరిస్సా స్కూల్ వద్ద కరస్పాండెంట్ చందు జాతీయ జెండాలనెగురవేశారు. జెండావి ష్కరణలు వేడుకల్లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డిలతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు అధికార పార్టీ కాంగ్రెస్‌కు చెందిన బోరింగ్ నర్సింహులు, గడ్డం ఎల్లప్ప, బీఆర్ఎస్‌కు చెందినగొడుగు వెంకటరాజు, సత్తూర్‌అశోక్‌గౌడ్, పులగుర్ల మల్లేష్, సత్తూర్ తిరుపతయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సుదర్శన్‌రెడ్డి, మండల నాయకుడు లిక్కి హరినాథ్‌గౌడ్‌లతోపాటుపలు పార్టీలనాయకులు పాల్గొన్నారు.

**కేజీబీవీ ఆశ్రమ పాఠశాలలో:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు న్యాయవాది భగవాన్ శ్రీవిష్ణుదేవ్ ప్రభు పాల్గొని విద్యార్థినులకు సందేశమిచ్చారు. విద్యార్థినులు విద్యతో పాటు దైవభక్తి, జాతీయ భావం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్, ఎస్ఓ ప్రశాంతి మహాభారత్, ఉమ్మడి పాలమూరు జిల్లా నాయకులు విజయ్‌కుమార్, బిజిలీ బాలరాజ్, సత్య నారాయణ గౌడ్, నసీరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ శుక్రవారం జాతీయ పతాకావిష్కరణ గావించారు. కార్యక్రమంలో స్థానిక అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.శ్రీను, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**జిల్లా పోలీస్ కార్యాలయంలో:** 79వ స్వాతంత్ర దినోత్సవంను పురస్కరించుకుని యోగేష్ గౌతమ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ ఎన్ లింగయ్య, సీఐ శివశంకర్, రామ్‌లాల్, రాజేందర్ రెడ్డి, సైదులు, ఆర్ఐ నరసింహ, ఎస్ఐలు, డిపిఓ స్టాఫ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పెబ్బేరు, ఆగస్టు15 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సి పాలిటీ పోలీస్ స్టేషన్లో ఎస్సై యుగంధర్‌రెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ అరిఫ్‌ద్దీన్, తహసిల్దార్ కార్యాలయంలోఎమ్మార్వో మురళిగౌడ్, ఎంపీడీవో కార్యాలయంలోఇన్చార్జ్ ఎంపీడీవో రోజారెడ్డి, సింగల్ విండో కార్యాలయంలో చైర్మన్ కోదండరామిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ప్రమోదినిరెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసులో షేక్ మున్న, ప్రభుత్వ ఆసుపత్రిలో డా. ప్రవళిక, మండల విద్యాధికారి కార్యాలయంలో జయ రాములు, తెలంగాణ మోడల్ స్కూల్లో ప్రిన్సిపల్ తూర్పింటి నరేష్, కృష్ణారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో చెన్నకేశవులు, ప్రెస్ క్లబ్ పెబ్బేర్ కార్యాలయంలో పరుశు రాముడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులుచిన్న రాములు, గ్రామీణ వైద్యుల కార్యాలయంలో అధ్యక్షుడు కేఎం భాష జండా ఎగరవేయడం జరిగింది.

**గద్వాలటౌన్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ముఖతిదులుగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌దొడ్డి వెంకట రాములు, మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల, జి.రాఘవేంద్ర రెడ్డి, ఆర్.కిషోర్, ఆతుకూరి రెహమాన్, శ్రీరాములు, రాజా రెడ్డి, పచర్ల శ్రీనివాసులు, సోమశేఖర్ రెడ్డి, కురవ పల్లయ్య, డి.శేఖర్ నాయుడు, గంజిపేట రాజు, ఎస్.రాము నాయుడు, రామకృష్ణ ముదిరాజు, టవర్ ఆటో ముక్బల్, చక్రధర్ రెడ్డి పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో:** ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జాతీయజెండాను ఎగురవేశారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

**చిన్న చింతకుంట, ఆగస్టు15 ప్రభాతవార్త,** తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఎల్లన్న, మండల పరిషత్ కార్యాలయంలోఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రామ్‌లాల్ నాయక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు శిరీష, వ్యవసాయ కార్యాల యంలో రాజేష్ కన్నా, మండల వనరుల భవనంలో ఎంఈఓ మురళి కృష్ణ, ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టల్‌లో వార్డెన్లు రాములు, విజయ్, జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, గ్రామసచివాలయంలో జాతీయ జెండాలను ఎగరవేశారు. లాల్‌కోట జడ్పీఉన్నత పాఠశాలలో, పర్దీపూర్‌లోని హరిజనవాడలో అంబేద్కర్‌యువజన సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ సంబరాలను జరుపుకున్నారు.

**దేవరకద్ర, ఆగస్టు 15 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గురకొండ జిల్లా పరిషత్ పాఠశాలలో కౌకుంట్ల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గుడ్ షెపర్డ్ స్కూల్‌లలో జెండా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య విద్యాధికారి రఘువరన్, పాఠశాల ప్రిన్సిపల్ రాజు, కోరుకొండ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుసోమనాథ్, గ్రామ పంచాయతీ అధికారి బుచ్చన్న, ఎంపీడీవో శివప్రసాద్, కౌకుంట్ల మండల నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

**నర్వ, ఆగస్టు15 ప్రభాతవార్త:** తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపిడిఓ కార్యాలయంలో శ్రీనివాసులు, సహకార సంఘంలో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పి. రమేష్, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి వెంకట రమణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, పి మధుసూధన్ రెడ్డి, ప్రాథమికపాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి, మహనీయుల విగ్రహాల వద్ద ఆ సంఘ సభ్యులు జాతీయ జెండాను ఎగురవేశారు. నర్వ మండల పరిధిలోని రాయికోడు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం గ్రామ అధ్యక్షులు మల్లన్ కోటిశంకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కే జయరాములు, గ్రా మ పెద్దలు ఆంజనేయులుగౌడ్, కాజా మైనుద్దీన్, మాజీ ఉప సర్పంచ్ రాయప్ప, పంచాయతీ కార్యదర్శి రమేష్, డి రాములు, మన్సూర్ పాషా, పి ఆనంద్, షఫీయొద్దీన్, ఫయా జుద్దీన్, రామాంజనేయులుగౌడ్, మైబు, ఆరేళ్లహను మన్న, కొత్త మాలే లింగన్న, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు కె. శ్రీనివాసులు, నౌసు వెంకటయ్య, మ్యాతరి చెన్నప్ప, కేరాము, కేఅనిల్, కేఅంజి, కోళ్ల హనుమంతు పాల్గొన్నారు.

**లింగాల, ఆగస్టు 15 ప్రభాతవార్త:** మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు విద్యాసంస్థలలో ఆయా గ్రామాల్లో శుక్రవారం వాడ వాడల మువ్వన్నెల జెండా రెప్ప రెప్పలాడింది. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై వెంకటేశ్వర్లుగౌడ్, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఓచంద్రశేఖర్, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ పాండు నాయక్, సింగిల్‌విండో కార్యాలయంలో చైర్మన్ హన్మంతురెడ్డి, వ్యవసాయ కార్యా లయంలో ఎఓ అనిల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యంలో ఎస్ఓ శారద, సాంఘిక సంక్షేమ గురు కుల పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎస్టీ హాస్టల్‌లో వార్డెన్ సనాతన బాలస్వామి, ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎంమంగమ్మ, సబ్‌స్టేషన్‌లో ఏఈ అప్పలనాయుడు, ఆయా గ్రామ పంచాయతీలో గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మువ్వన్నెల జెండాను ఎగురవేశారు.

**వనపర్తి క్రైమ్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, సిబ్బందితో కలిసి జాతీయ గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, డిసిఆర్బి డిఎస్పి, ఉమామహేశ్వరరావు, వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వరరావు, జిల్లా పోలీసు కార్యాలయం ఏవో, సునందన, వనపర్తి ఐ,కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సిఐ, నరేష్, సిసిఎస్ సిఐ, రవిపాల్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పల నాయుడు, శ్రీనివాస్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**నారాయణపేట, ఆగస్టు15 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ కేంద్రంలోని శ్రీహంసవాహిని ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పురవీధుల గుండా ర్యాలీ అనంతరం పాఠశాలఆవరణలో ప్రధానోపాధ్యాయులు రాజేష్ కుమార్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నమత, ఉషారాణి, అమల, షమీనా, విజయ, ఉదయ్, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

**ఊట్కూర్, ఆగస్టు 15 ప్రభాతవార్త :** 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఊట్కూర్ మండల కేంద్రంలోని జి.పి.ఎస్. పాఠశాల, జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలలో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగం యువతకు స్ఫూర్తి కావాలని, వివక్షలేని సమాజమే మహనీయులకు నిజమైన నివాళి అని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలతో నివాళుల ర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుల నుండి యువత స్ఫూర్తి పొందాలని, ఆ స్ఫూర్తితో నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధి, పునరాంకితానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి ప్రతి పేద ప్రజలకు చేరేలా అధికార యంత్రాంగం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాత్రికేయులు, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల సిబ్బంది అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**ఎస్పీ కార్యాలయంలో:** నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ కార్యాలయం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ పతాకాన్ని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆవిష్కరించి వేడుకల్లో పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఓల్డ్ పోలీస్ హెడ్ క్వార్టర్‌లో రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మరియు జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్‌లతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వివిధ విభాగాలలో ఉన్న పోలీస్ అధికారులకు 14 మందికి పథకాలను జిల్లా ఎస్పీ సమక్షంలో అందించారు. వీరిలో 02 ఉత్తమ సేవా పథకం, 12 మందికి పోలీసు సేవా పథకాలను రాష్ట్ర ప్రణాళిక ఉప సంఘం అధ్యక్షుడు మరియు జిల్లా కలెక్టర్, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో అందించారు.

# మహనీయుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎంపీ డీకే అరుణ



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 15 ప్రభాతవార్త:** మహనీయుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని మహబూబ్‌నగర్ ఎంపీ డికె అరుణ పిలుపునిచ్చారు. బీజేపీ మహబూబ్ నగర్ జిల్లా కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. దేశ రక్షణ ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రధాని మోడీకి మనమంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్‌రెడ్డి, మహిళా మర్చ జిల్లా అధ్యక్షురాలు సాహితిరెడ్డి, నాయకులు కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు

## -అభినందించిన జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు ఉత్తమ సేవా, సేవా పథకాలు రావడం జరిగింది వారు నారాయణపేట జిల్లాలో ఏడు మంది పోలీసులు సేవ పథకాలను వరించారు హెడ్ కానిస్టేబుల్ కే. చంద్రప్ప (స్పెషల్ బ్రాంచ్) కు ఉత్తమ సేవా పతకం వచ్చింది. అలాగే బి. అంజయ్య ఏఎస్ఐ (నారాయణపేట టౌన్), రామచంద్రయ్య హెడ్ కానిస్టేబుల్ (మక్తల్ పిఎస్), వి. కురుమయ్య హెడ్ కానిస్టేబుల్ (నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్) అలాగే ముగ్గురు ఆర్మ్ డ్ రిజర్వు హెడ్ కానిస్టేబుల్స్ కే.కృష్ణయ్య, ఆర్. శ్రీనివాస్, బి.నర్సయ్యలకు సేవా పతకాలు వరించాయి. అలాగే జిల్లా వ్యాప్తంగా 26 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి పోలీస్ శాఖలో ఉత్తమ సేవలందించినందుకు ప్రశంసా పత్రాలను ఎంపికైనా పోలీసులకు పోలీసు పరేడ్ మైదానంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ ఎస్పీ, ఎమ్మెల్యే, చేతుల మీదుగా అందుకున్నారు. వారిని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదే ఉత్సాహంతో ముమ్ముందు ప్రజలకు మంచి సేవలు అందించాలని ఎస్పీ తెలిపారు.

**ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందుకున్న మండల తహసీల్దార్**

**శ్రీరంగాపూర్, ఆగస్టు15 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో 79వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. శ్రీరంగాపూర్ మండల తహసీల్దార్ రాజు పట్నం నరేందర్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ప్రశంస పత్రాన్ని అందుకోవడం జరిగింది. ఉత్తమ ప్రశంస పత్రాన్ని అందుకున్న తహసిల్దార్ రాజుకు అభినందనలు తెలియజేయడం జరిగింది.

**మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేత**

**నారాయణపేట, ఆగస్టు15 ప్రభాతవార్త :** నారాయణపేట మండల పరిధిలోని జిలాల్‌పూర్‌లో పశువైద్య కేంద్రంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వై.కృష్ణశ్రీకి స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్లో జరిగిన కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖమంత్రి వాకిటి శ్రీహరి, నారాయణపేట్ ఎమ్మెల్యే చిట్టెం పరిణిక రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎస్పీ యోగేష్ గౌతమ్‌చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రాన్ని అందించారు. ప్రశంస పత్రం అందుకోవడం పట్ల అధికారులు ఆమెను అభినందించారు.

# భాను కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

**జడ్చర్ల టౌన్, ఆగస్టు15 ప్రభాతవార్త:** జడ్చర్ల లోని బోయల కుంటకు చెందిన ఉప్పరి బాను గురువారం చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. అయితే బాను ఆచూకీ ఇంకా తెలియ రాలేదు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని బిఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. భాను భార్య శాంతి ప్రియ, తండ్రి వెంకటయ్య ను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, నాయకులు ఇంతియాజ్ ఖాన్, శంకర్ నాయక్, శ్రీను యాదవ్, కరాటే శ్రీను, స్వేర్ శ్రీను పాల్గొన్నారు.

# క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో టాపర్లకు సన్మానం

**జడ్చర్ల, ఆగస్టు15 ప్రభాతవార్త:** జడ్చర్ల క్లాస్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకన్యకా పరమేశ్వరి మాత ఆలయంలో జడ్చర్ల ప్రభుత్వ పాఠశాలలో చదివిన పదవ తరగతి టాపర్లను సన్మానించి , వారికి ప్రోత్సాహకరంగా ఒక్కొక్కరికి రూ.1116 అందజేశారు. కార్యక్రమంలో జడ్చర్ల ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు కోట్ర మధుబాబు, కన్యకా పరమేశ్వరి ఆలయం అధ్యక్షులు దాచేపల్లి చంద్రయ్య, క్లాస్ మెంట్ క్లబ్ అధ్యక్షులు ప్రదీప్, సెక్రటరీ కట్టా వెంకటేష్, సభ్యులు దత్తు, దేవరాజ్, భరత్, మురళి, ఉపాధ్యాయురాలు గీత తదితరులు పాల్గొన్నారు.

# నిద్రలోనే అనంతలోకాలకు..

(మొదటి పేజీ తరువాయి)

4:30 గంటల ప్రాంతంలో అతివేగంతో వెనకాల నుంచి లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ నరసింహతో పాటు హైదరాబాదుకు చెందిన మరో ఇద్దరు మహిళలు గుర్రం రాధిక , లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులను మహబూబ్నగర్ జిల్లా దావకానకు తరలించగా చికిత్సపంతో మరో వ్యక్తి నరసింహ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ అజాగ్రత్త అతివేగం వల్లే ప్రమాదం జరిగినట్లు తోటి ప్రయాణికులు తెలిపారు. కెమెరాకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జడ్చర్ల సిఐ కమలాకర్ వెల్లడించారు.

# ఉత్తమ సేవలకు అవార్డులు

**మహబూబ్‌నగర్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం పరేడ్ గ్రౌండ్లో మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు కలెక్టర్ విజయేంద్ర బోయి ఎస్పీ జానకి ధరావత్ చేతుల మీదుగా జిల్లా అధికారులు ఉత్తమ అవార్డులు పొందారు. అవార్డులు పొందిన వారిలో జిల్లా సహకార అధికారి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శంకర చారి, జిల్లా పౌరసరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ గౌడ్, సహకార డిప్యూటీ రిజిస్టర్ ఆడిట్ అధికారి టైటస్ పాల్, గృహ నిర్మాణ శాఖ పిడి వైద్యం భాస్కర్, పౌర సరఫరాల డిఎం రవినాయక్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయ సిబ్బంది కూడా ఉన్నారు.



# భూ నిర్వాసితులకు పరిహారం అందే వరకు పోరాటం

## ◆ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్



భూనిర్వాసితుల దీక్ష వద్ద జాతీయ పతాకావిష్కరణ చేసిన దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు15 ప్రభాతవార్త:** మక్తల్ నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందే వరకు పోరాటం కొనసాగుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ తెలియజేశారు. శుక్రవారం రోజు భూనిర్వాసితుల రిలే దీక్షలు 31వ రోజుకు చేరుకున్న సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పంతంకు పోయి భూ నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఈ ఉద్యమం తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు. భువనగిరి గంధ మల్ల లో 24 లక్షలు, ముఖ్యమంత్రి నియోజకవర్గం లగచర్లలో 20 లక్షలు పరిహారం అందిస్తూ ఒకరికి ఉద్యోగం ఇందిరమ్మ ఇల్లు తదితర బెనిఫిట్స్ కలగజేస్తున్న ప్రభుత్వం నారాయణపేట జిల్లా వాసుల పైన ఎందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నెల రోజులకు పైగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం మొండిగా ఉండడం సరైన పద్ధతి కాదన్నారు. బిఆర్ఎస్ నారాయణపేట మండల కార్యదర్శి కొల్లంపల్లి అలీ మాట్లాడుతూ భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. భూ నిర్వాసితులు చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. అంతకుముందు భూ నిర్వాసితుల శిబిరం ముందు 79వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని భూనిర్వాసితుల సంఘం అధ్యక్షులు మశ్చేంధర్ జెండావిష్కరణ చేశారు. ఈ జెండా ఆవిష్కరణలో భూనిర్వశితుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వెంకట్రామిరెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ధర్మరాజు నాయకులు కుర్వ హన్మంతు లక్ష్మికాంత్, సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం, ఎస్ఎఫ్ఐ నాయకులు నరహరి పవన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే నాయకుడు నరేంద్ర మోడీ

## ◆ బిజెపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ



జెండా ఆవిష్కరించిన డి.నారాయణ

**వనపర్తి రూరల్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే నాయకుడిని బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ అన్నారు. శుక్రవారం బిజెపి జిల్లా కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం 79 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా 79 మీటర్ల భారీ త్రివర్ణ పతాకంతో జిల్లా పార్టీ కార్యాలయం నుండి వివేకానంద చౌరస్తా, రాజీవ్ చౌక్, బస్‌డిపో గంజి రోడ్డు మీదుగా పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ర్యాలీని ముగించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ పాలనలో దేశం అన్ని రంగాల్లో విఫలం కాబడ్డదని గత 11 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయం చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలో మూడో స్థానంలో నిలబెట్టాడని పేర్కొన్నారు. ప్రపంచంలోని అగ్రరాజ్యాలతో పాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్, తుర్కియే చర్యలను ప్రపంచ వేదికలపై ఎండగడుతూ అవసరం వస్తే బుల్లెట్‌కు మిస్సైల్‌తో బదిలిస్తామని ఆపరేషన్ సింధూర్ తో నరేంద్ర మోడీ ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. దేశాన్ని పరాయిపాలన నుండి విముక్తి చేయడానికి ఎందరో స్వాతంత్ర సమర యోధులు తమ జీవితాలను త్యాగం చేశారని వారిని స్ఫూర్తిగా తీసుకొని అవసరం అయితే సర్వస్వం త్యాగం చేయడానికి సిద్ధంగాఉండాలని, ఈ దేశాన్ని పాలించడం మా జన్మ హక్కుని కాంగ్రెస్ పార్టీ నెహ్రూ కుటుంబం భావించిన సమయంలో 140 కోట్ల ప్రజల గుండెలను గెలుచుకుని చారిత్రక మూడవ పర్యాయం ప్రధాని హోదాలో ఒకఅఖండ భారతావని కాంక్షించే భరతమాత ముద్దుబిడ్డ ఎర్రకోటపై 12వ పర్యాయం సగర్వంగా జాతీయ పతాకాన్నిఎగురవేసి కాంగ్రెస్ ముక్త్ భారత్‌లో భాగంగా ఆ పార్టీనిమూడు రాష్ట్రాలకు పరిమితం చేశారన్నారు. బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బహుమతులు అందజేత

**ఊట్కూర్, ఆగస్ట్15 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 79వస్వాతంత్ర్య దినోత్సవ వేడుకల, సందర్భంగా గత విద్యా సంవత్సరపు పదవ తరగతి టాపర్స్‌కు నగదు బహుమతులు ఘనంగా అందజేశారు. రైస్ మిల్ హన్మిరెడ్డి 5,000 రూపాయలు, మీదిగేరి కనకప్ప జ్ఞాపకార్థం 2,500 రూపాయలు, సప్పటి తిమ్మప్ప జ్ఞాపకార్థం 2,500 రూపాయలు, అందజేశారు. మొత్తం 10,000 రూపాయల నగదు బహుమతులను మొదటి టాపర్ డి. కల్పనకు 5,000.రెండవ టాపర్ జట్రం శ్రీని వాస్‌కు 2,500.మూడవ టాపర్ ఎల్. అరుణ్‌కు 2,500 పాఠశాల హెచ్.ఎం. కిషోర్ కుమార్, హన్మిరెడ్డి, రమేష్, నరేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సంద ర్భంగా హన్మిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని టాపర్స్‌ను అభినందించారు. పాఠశాల ప్రాంగణం దేశభక్తి గీతాలతో మార్మోగి పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

# అయిజ పిఎసిఎస్ కార్యదర్శికి ఉత్తమ పురస్కారం

**అయిజ ఆగస్టు 15, ప్రభాతవార్త;** 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లాలోనే అత్యుత్తమ సొసైటీగా అభివృద్ధి పరిచిన అయిజ పిఎసిఎస్ కార్యదర్శి మల్లేష్‌కి ఉత్తమ పురస్కారం లభించింది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పర్యాట గ్రామంలో నిర్వహించిన స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు, జిల్లా కలెక్టర్‌సంతోష్, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, నర్సింగరావుల ద్వారా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఈరోజు జిల్లా స్థాయిలో పురస్కారం అందుకోవడం ఆనందించదగ్గ విషయమని, సొసైటీకే గర్వకారణమని చైర్మన్ పోతుల మధుసూదన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది సొసైటీలో పనిచేసే సిబ్బంది కృషి ద్వారానే సాధ్యమైందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.